ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్

- ఉప ఎన్నికలు ఉత్తిమాటే... ఆందోళన వద్దు
- శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు
- ఎమ్మెల్యేలెవరైనా సిఎం వద్దకు రావొచ్చు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటి నిరోధానికి, నిషేధించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి కేసుల్లో పడే శిక్షలను కూడా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ ప్రచారం కల్పించిన వారిని విచారించాం. వారిని విచారించడంతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లు కాదు. సిట్ ఏర్పాటు చేసి వీటికి అడ్డకట్ట వేయాలని నిర్ణయించాం. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవు' అని హెచ్చరించారు.

శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?

"శాంతిభద్రతల విషయంలోనూ కొందరు విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఎంత ఉదాసీనంగా ఉందో అందరికీ తెలుసు. దిశ ఘటన, న్యాయవాద దంపతుల హత్య వంటివి గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణలు. న్యాయవాద దంపతులను నడిరోడ్డుపై చంపేస్తే ఇప్పటికీ చర్యల్లేవు. సింగరేణి కాలనీలో ఆరేళ్ల బాలిక హత్యాచార ఉదంతంలో ఆనాడు చర్యలు తీసుకోలేదు. మహిళలపై దాడుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. జూబ్లీహిల్స్ పబ్ కేసులో బిఆర్ఎస్ నాయకుడి కుమారుడే ఉన్నా పట్టించుకోలేదు. ఒక మంత్రి కుమారుడి ప్రమేయం ఉందని అప్పట్లో వార్తలొచ్చాయి. శాంతిభద్రతల విషయంలో దుష్ప్రచారం చేయడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులను అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కుప్పకూలిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం దివాలా తీస్తే బిఆర్ఎస్ నేతలు సంతోషపడతారా? అధికార కాంక్షతో ఎలాంటి అసత్య ప్రచారమైనా చేస్తారా? ఈ 15 నెలల పాలనలో శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?" అని సిఎం ప్రశ్నించారు.

"ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారు? గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరు? ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంత మాత్రాన ఇప్పుడే రావు. బిఆర్ఎస్ ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను" అని సిఎం తెలిపారు

విద్యారంగం క్షీణిస్తోంది

విద్యారంగం రోజు రోజుకూ క్షీణించిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శాసన మండలిలో విద్యాశాఖపై సిఎం మాట్లాడారు. "2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 75 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదు. తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానంలో తెలంగాణ 36వ స్థానంలో ఉంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అథమ స్థానంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు చదవలేని పరిస్థితి. ప్రతి స్థాయిలో విద్యారంగం రోజు రోజుకూ క్షీణించి పోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం. 21వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఏడెనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 36 వేల మంది టీచర్ల బదిలీ చేపట్టాం. కలెక్టర్లనైనా బదిలీ చేయవచ్చు గానీ, టీచర్ల బదిలీ ఆషామాషీ కాదు. 36వేల మంది టీచర్లను చిన్న ఆరోపణలు లేకుండా బదిలీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై రూ.1.08 లక్షలు చొప్పున ఖర్చు చేస్తున్నాం. ప్రైవేటులో రూ.50వేల వరకు ఖర్చయితే.. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్ష ఖర్చవుతోంది. బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమిస్తూ రూ.23,108 కోట్లు కేటాయించాం. విద్యా రంగానికి భారీగా నిధులు కేటాయించినా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇందుకు ప్రభుత్వమే కాదు.. సమాజం బాధ్యత తీసుకోవాలి. లోతుగా విశ్లేషించి సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచన చేసినంత కాలం విద్యారంగం ప్రక్షాళన కాదు. విద్య పట్ల ప్రత్యేక విధానం తీసుకురావాలనేది ప్రభుత్వ ఉద్దేశం. విద్యారంగం బలోపేతానికి సూచనల కోసం విద్యా కమిషన్ ఏర్పాటుచేశాం.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించాలి

ఏటా లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. రూ.15వేలకు కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు పనిచేసే పరిస్థితి. నైపుణ్యం ఉన్న యువత దొరకట్లేదని కంపెనీలు చెబుతున్నాయి. తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒడిశా, బిహార్ నుంచి రావట్లేదు. మన వద్ద ఉన్న విద్యార్థులకు నైపుణ్యం లేక రోడ్లపై తిరుగుతున్నారు. మన నిర్లక్ష్యంతో సమాజ నైపుణ్యాల మేరకు విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయలేదు. నైపుణ్యాల పెంపునకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా పత్రిక ద్వారా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమం నడిపారు. గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో విద్యా ప్రమాణాల మెరుకు చర్యలు తీసుకుంటాం. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే స్థానిక సంస్థల్లో పోటీకి, ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అవకాశంపై చర్చించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి" అని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఉగాది నుంచి సన్నబియ్యం

- ఏప్రిల్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ
- 'కాళేశ్వరం' బాధ్యులపై చర్యలు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెల్లరేషన్ కార్డు దారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ....రాష్ట్రంలో 89.1 లక్షల రేషన్ కార్డులకు ఏటా 24 లక్షల మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని అదిస్తున్నామని చెప్పారు. అయితే ఆ బియ్యం పక్కదారి పడుతున్నాయనే అరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందించనున్నామని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. బియ్యంతో పాటు త్వరలో ఇతర నిత్యావసర వస్తువులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఏప్రిల్ నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. భౌతికంగా కార్డుల జారీలో ఆలస్యమైనా పోర్టల్‌లో పేరున్న వారికి సన్న బియ్యాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు ఉన్న వారు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. నీటి పారుదల ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో పెట్టిన నిధుల్లోంచి సగం వరకు గత ప్రాజెక్టులకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను ప్రభుత్వం సమ దృష్టితో చూస్తోందని తెలిపారు. నిధుల కేటాయింపులో ప్రాంతాల వారీగా ఎలాంటి వివక్షను పాటించడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని అన్నారు. డిపిఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బిసి సొరంగ ప్రమాదం దురదృష్టకరమనీ, బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు

టన్నెల్‌లో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో నిరంతరాయంగా మట్టితవ్వకాలు కొనసాగుతున్నాయి. ఊట నీటి పంపింగ్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఎస్కవేటర్లతో మట్టితవ్వకాలు చేస్తూ.. సహాయ చర్యలు ముమ్మరం చేశారు. ఉబికి వస్తున్న నీటి ఊటను అరికట్టడానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, పర్యవేక్షణ ప్రత్యేక అధికారి శివ శంకర్ బుధవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగిలిన ఆరుగురు కార్మికుల కోసం సహాయక చర్యల వేగవంతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు తెలిపారు. నాలుగు ఎస్కవేటర్‌లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి తరలిస్తున్నట్టు, మట్టి తవ్వకాలకు అడ్డుపడుతున్న టిబిఎం భాగాలను తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్టు వివరించారు. టన్నెల్ లోపల 2.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 5 పంపింగ్ స్టేషన్‌ల ద్వారా నీటిని కృష్ణానదిలోకి పంపుతున్నట్టు చెప్పారు. మట్టి తవ్వకాల అనంతరం లోకో ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, నాగర్‌కర్నూల్ ఆర్‌డిఒ సురేష్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇరిగేషన్ ఇఇ శ్రీనివాస్, జెపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిందించడమే పనిగా పెట్టుకున్నారు

- ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్‌పై సీతక్క ఫైర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడమే పని పెట్టుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనను, 15 నెలల కాంగ్రెస్ పాలనను ఒకేగాటన కట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో చేసిన అభివృద్ధి పట్ల ఆయనకు కొద్దిగా కూడా సానుకూల దృక్పథం లేదని చెప్పారు. బుధవారం శాసనసభలో హోం శాఖ, గృహ నిర్మాణ శాఖ పద్దులపై అక్బరుద్దీన్ చేసిన విమర్శలను సీతక్క తిప్పికొట్టారు. శాంతిభద్రతల రక్షణలో నిమగ్నమవుతున్న పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని విమర్శించారు. పోలీసుల్లో మంచివారు కూడా ఉంటారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందని, వాటిని నియంత్రిస్తున్న క్రమంలో కొంత రియల్ ఎస్టేట్ వెనుకపట్టు పడిందని చెప్పారు. రాష్ట్రంలోని యువత గంజాయి. డ్రగ్స్, కొకైన్ మత్తు పదార్థాల్లో మునిగిపోయారనీ, ఆ మత్తులో మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పూర్తిగా నియంత్రించే పనిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. మత్తు పదార్థాల సరఫరా వెనుక బీఆర్ఎస్‌లోని కొంత మంది పెద్దల హస్తం ఉందని ఆమె ఆరోపించారు.

ప్రాంతీయ కంటెంట్ సంస్థలతో స్నాప్‌చాట్ జట్టు

ప్రజాశక్తి -హైదరాబాద్

ప్రముఖ సోషల్ మీడియా వేదిక స్నాప్‌చాట్ హైదరాబాద్‌లోని పలు కంటెంట్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు బుధవారం ప్రకటించింది. నగరంలోని తమడ మీడియా, చాయ్ బిస్కెట్ - మ్యుటినీ, ఎన్ఆర్‌జివై, సిల్లీ మాంక్స్, వాక్ అవుట్ మీడియా సంస్థలతో ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా స్నాప్‌చాట్‌లోకి నేచురల్ స్టార్ నానీ ప్రవేశించడంతో పాటుగా సందడి చేశారు. ప్రాంతీయ కంటెంట్ క్రియేటర్లకు మద్దతు ఇవ్వడానికి, తదుపరి తరం ప్రతిభకు తోడ్పడేందుకు మరిన్ని భాగస్వామ్యాలను ఏర్పాటు చేస్తోన్నట్లు స్నాప్ ఇన్ కార్పొరేషన్ కంటెంట్, ఎఆర్ భాగస్వామ్యాల డైరెక్టర్ సాకేత్ ఝా సౌరబ్ తెలిపారు. స్నాప్ క్రియేటర్లకు అవగాహన కల్పించడానికి స్నాప్ స్కూల్ వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. స్థానిక ప్రతిభను శక్తివంతం చేయడం, క్రియేటర్లు తమ కమ్యూనిటీలను పెంచుకోవడానికి, వారి డిజిటల్ స్టోరీలకు డబ్బు సంపాదించేలా తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛపై నిర్బంధం

- సిపిఐ సభాపక్ష నేత కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛపై అప్రకటిత నిర్బంధం కొనసాగుతోందని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శాసనసభలో వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని మనం గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యుడు సేచ్ఛగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసే పరిస్థితులు లేవని గుర్తు చేశారు. ఫిన్‌లాండ్, స్కాట్లాండ్, న్యూజిలాండ్ తదితర దేశాల పోలీసింగ్‌ను పరిశీలించి మరిన్ని సంస్కరణలు తేవాలని సూచించారు. అర్బన్ నక్సలైట్ల పేరిట పౌరహక్కుల నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థలో ఆర్డినరీ విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. పోలీసులపై రాజకీయ జోక్యం తగ్గితేనే వారు స్వేచ్ఛగా పనిచేస్తారని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ కారులపై నమోదైన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్వహణ భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు..

ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నాం : శ్రీధర్‌బాబు

హైదరాబాద్ బ్యూరో:నూతన మున్సిపాల్టీల ఏర్పాటు, గ్రామాల విలీనం, మార్పులు తదితర విషయాల్లో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణ మున్సిపాల్టీస్ యాక్ట్, 2019 సవరణ బిల్లును ఆమోదించారు. అంతకు ముందు జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, నేరుగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని చట్టంలో లేదనీ, అయితే వివిధ వినతిపత్రాల రూపంలో వచ్చిన ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి కలెక్టర్లు నివేదికలు ఇచ్చారని తెలిపారు.

ఇంకొక్క తడికన్నా సాగు నీరివ్వండి..

- కాలంతో వచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు
- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంకొక్క తడికన్నా సాగు నీరిస్తే కొందరన్నా రైతులు అప్పుల బారినుంచి బయట పడతారని, మంత్రి ఉత్తమ్ స్పందించి నీరివ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా రైతుల ఉసురు తీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని విమర్శించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని చందుపట్ల, మొగ్గయ్యగూడెం గ్రామంలో ఎండిన పంటల పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే అని అన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం.. ఈమూడే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అని ఆరోపించారు. పదేళ్ళ ప్రశాంతంగా ఉన్న రైతాంగాన్ని మళ్లీ కన్నీళ్ల పాలుచేసిన పాపం కాంగ్రెస్‌దేనని అన్నారు. పొట్టకొచ్చిన పంటలకు నీళు లేక పశువుల మేతకు అమ్ముకునే పరిస్థితొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రారంభించిన తర్వాత ఎకరం కూడా ఎండిపోలేదని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రెండుసార్లు యాసంగి పంటలు ఎండిపోయాయని అన్నారు. కాళేశ్వరం కాకుండా ఎస్ఆర్‌ఎస్‌పి నీళ్లే అయితే ఇప్పుడు పంటలు ఎందుకు ఎండుతున్నాయో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరాన్ని తమకు అప్పగిస్తే ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూస్తామని చెప్పారు. ఎండిపోయిన పంటపొలాలు, రైతన్నల కష్టాల గురించి ఏ ఒక్క మంత్రి కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. దావతుకు పోవడానికి హెలికాప్టర్ దొరుకుతున్నాయి కానీ ఎండిన పొలాలను పరిశీలించడానికి సమయం దొరకట్లేదని ఎద్దేవా చేశారు. ఎండిన పొలాలను, రైతన్నల కష్టాలను చూసి ఎక్కిరించడానికి ఉగాది రోజున సిఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్నట్టుందని అన్నారు. మంత్రులకు శాఖల గురించి అర్థం కాకపోతే కనీసం అధికారులను అడిగి తెలుసుకుంటే మంచిదని సూచించారు. కరోనా కష్ట కాలంలో కూడా రైతాంగానికి చిన్న ఇబ్బంది కలగకుండా కెసిఆర్ నాయకత్వంలో అండగా నిలిచి ఆదుకున్నామని చెప్పారు. కెసిఆర్ ముందుచూపుతో.. అద్భుత ప్రణాళికతో రాష్ట్రాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, బాబు నాయక్, నరసింహారావు, జిడి బిక్షం, నాగు నాయక్, సత్యానారాయణ రెడ్డి, హముడ, నాగయ్య, చెరుకు నగేష్, చిన్న వెంకన్న, అనంతుల మధు, సునీల్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ల నిర్వహణ డబ్బులు ఇవ్వండి

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసుస్టేషన్ల మెయింటెన్స్‌కు ఇచ్చే రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.75 వేలు ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. శాసనసభలో హోంశాఖ పద్దుపై ఆయన మాట్లాడుతూ..పదేండ్లలో పోలీస్ వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దామనీ, లక్ష సిసి కెమెరాలను ఒకేసారి పరిశీలించేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించామని తెలిపారు. పోలీస్ స్టేషన్లను ఐటీ ఆఫీసుల్లా ఆధునీకరించామనీ, వాహనాలను సహకరించామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని..గత చరిత్ర అవసరం లేదనీ సబ్జెక్టుకు పరిమితమై మాట్లాడాలని సూచించారు. ఐదు గంటల వరకు సభ ముగిసేలా సహకరించాలనీ, వరుసగా రెండు, మూడు రోజుల నుంచి అర్ధరాత్రి 12, ఒంటి గంట అవుతున్నదనీ, దీనివల్ల ఉద్యోగులకు ఇబ్బంది పడుతున్నారని సభా దృష్టికి తీసుకొచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు తలసాని మాట్లాడుతూ..తమకే వర్తిస్తదా? వారికి వర్తించదా? 15 నెలల నుంచి ఎవరికి మైకు ఇచ్చినా గత ప్రభుత్వం..గత ప్రభుత్వం అంటుంటే చప్పుడు చేయరు గానీ తాము లేవగానే అడ్డుకోవడం తగదని హితవు పలికారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..నెహ్రూ, ఇందిరాగాంధీ నుంచి చరిత్ర చెబుతున్నది వాళ్లని విమర్శించారు. రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

తోట యాక్ట్, నిబంధనలు అడాప్ట్

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం చేసిన ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ కణజాలల యాక్ట్, 2011 (అమెండ్‌మెంట్) (తోట) చట్టాన్ని, నిబంధనలను రాష్ట్రానికి అడాప్ట్ చేసుకుంటున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ 1994లో చేసిన ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ (సెంట్రల్ యాక్ట్ 42), 1994 అండ్ రూల్స్, 1995నే ప్రస్తుతం తోట చట్టంగా పిలుస్తున్నారని తెలిపారు. అవయవాల మార్పిడితో పాటు, కణజాలల మార్పిడిని కూడా తోట యాక్ట్ అనుమతించిందని చెప్పారు. "తోట యాక్ట్‌కు సంబంధించిన నిబంధనలను 2014లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దేశంలోని 24 రాష్ట్రాల్లో తోట చట్టం, ఆ చట్ట ప్రకారం 2014లో చేసిన నిబంధనలే అమలులో ఉన్నాయి. బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి వీటిని సేకరించి, అవసరమైన వారికి మార్పిడి చేయడానికి వీలుపడుతుంది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు వారి మనవళ్లు, మనవరాళ్లకు అవయవ దానం చేయడానికి చట్టం అనుమతి ఇస్తుంది. కొన్ని రకాల జన్యుపరమైన సమస్యల వల్ల పిల్లలకు కాలేయ మార్పిడి చేయాల్సి వస్తుంది. ఇలాంటి పిల్లలకు, వారి గ్రాండ్ పేరెంట్స్ కాలేయదానం చేయడానికి అవకాశం కలుగుతుంది. పిల్లల ప్రాణాలు కాపాడడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే, మనవళ్లు, మనవరాళ్లు కూడా వారి గ్రాండ్ పేరెంట్స్‌కు అవయవ దానం చేయొచ్చు.... " మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు."అవయవాల అక్రమ రవాణా, అక్రమ మార్పిడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించేలా కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించి అవయవ మార్పిడి చేస్తే గతంలో రూ.5 వేల జరిమానా, 3 సంవత్సరాల వరకూ జైలు శిక్ష విధించేందుకే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం రూ.ఒక కోటి రూపాయల వరకూ జరిమానా, పది సంవత్సరాల జైలు శిక్ష విధించవచ్చు" అని మంత్రి వివరించారు. "1995 నాటి నిబంధనల ప్రకారం బ్రెయిన్ డెత్ డిక్లేర్ చేసే అధికారం న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లకు మాత్రమే ఉంది. కొత్త నిబంధనల ప్రకారం ఫిజీషియన్, సర్జన్, ఇంటెన్సివిస్ట్, అనేస్థియసిస్ట్‌లకు కూడా బ్రెయిన్ డెత్ డిక్లేర్ చేయడానికి అర్హులు అవుతారు. దీంతో బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవాలు వృథాగా పోకుండా, అవసరమైన పేషెంట్ల ప్రాణాలు కాపాడడానికి ఉపయోగ పడుతాయి. అవయవ దానం, మార్పిడిపై పర్యవేక్షణ కోసం ప్రభుత్వ స్థాయిలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తాం. కేంద్రం, ఇతర రాష్ట్రాల్లోని అవయవ మార్పిడి వ్యవస్థలతో జీవన్‌దాన్‌ను అనుసంధానిస్తాం. ఇతర రాష్ట్రాల్లో బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి సేకరించిన అవయవాలను, మన రాష్ట్రంలోని పేషెంట్లకు అమర్చడానికి అవకాశం కలుగుతుంది. బ్రెయిన్ డెత్ డిక్లరేషన్, అవయవదానం, అవయవాల సేకరణ, మార్పిడి ప్రక్రియలను పర్యవేక్షణ కోసం ప్రతి హాస్పిటల్‌లో ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ల నియమిస్తాం. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు "అవయవాలు, కణజాల సేకరణ కేంద్రాలు, స్టోరేజీ కేంద్రాలు" ఏర్పాటు చేస్తాం. దీంతో పారదర్శకత పెరుగుతుంది. మెడికల్ టూరిజం బలోపేతానికి దోహదపడుతుంది" అని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు.

శాసనమండలి ఆవరణలో నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు

శాసనమండలి ఆవరణలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనమండలి ఆవరణలో బుధవారం బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆకస్మికంగా నిరసనకు దిగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇవ్వాలంటూ బంగారం కడ్డీల నమూనాలను ప్రదర్శిస్తూ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నెలలుగా రాష్ట్రంలో కొత్తగా పెళ్లైన జంటలు తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీలు తెలిపారు. నిరుపేదలు ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే కెసిఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.లక్షకుపైగా ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ నేతలు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారనీ, అధికారంలోకి రాగానే ఆ హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఖాతాల్లో జమ చేస్తామని మాయ మాటలు చెప్పారని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ నిరసనలో శాసనమండలిలో బిఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, వాణిదేవి, తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు,
మంగళగిరి
I.A. No. 156/2023
in O.S. No. 84/2022
Between :
వేంపాటి సాంబశివరావు మరియు శ్రీనివాసరావు
.... పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్
మరియు
1) వేజండ్ల గురు సాంబ్రాజ్య రజని .. 1వ ప్రతివాది
2) బత్తుల మాధవి .... 2వ ప్రతివాది
3) G.N.R. Infrastructurers, rep. by its Managing Partmenrs గాదె నరసారెడ్డి, గాదె నీలిమ,- Builder & Developer, Plot No. 860, Flat No. 401, భ్రమరాంబ నివాస్, మాతృశ్రీ నగర్, మియాపూర్, హైదరాబాద్-49, తెలంగాణా రాష్ట్రం.
పై నెంబరు కేసులో పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం 3వ ప్రతివాదులుగా వున్న మీరు ది. 1-4-2025 ఉదయం 10-30 గం.లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరయి మీకుగల అభ్యంతరాలను తెలియజేసు కొనవలయును. లేనియెడల పరోక్షంగా పై కేసును తీర్మానించ బడును. అని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ పరచటం జరిగినది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 1-4-2025
ఇట్లు
జంపా దీనదయాళ్,
పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్ తరపు న్యాయవాది,
విజయవాడ. సెల్ : 91105 77509

మహారాజశ్రీ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు,
మంగళగిరి
I.A. No. 155/2023
in O.S. No. 84/2022
Between :
వేంపాటి సాంబశివరావు మరియు శ్రీనివాసరావు
.... పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్
మరియు
1) వేజండ్ల గురు సాంబ్రాజ్య రజని .. 1వ ప్రతివాది
2) బత్తుల మాధవి .... 2వ ప్రతివాది
3) G.N.R. Infrastructurers, rep. by its Managing Partmenrs గాదె నరసారెడ్డి, గాదె నీలిమ,- Builder & Developer, Plot No. 860, Flat No. 401, భ్రమరాంబ నివాస్, మాతృశ్రీ నగర్, మియాపూర్, హైదరాబాద్-49, తెలంగాణా రాష్ట్రం.
పై నెంబరు కేసులో పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం 3వ ప్రతివాదులుగా వున్న మీరు ది. 1-4-2025 ఉదయం 10-30 గం.లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరయి మీకుగల అభ్యంతరాలను తెలియజేసు కొనవలయును. లేనియెడల పరోక్షంగా పై కేసును తీర్మానించ బడును. అని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ పరచటం జరిగినది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 1-4-2025
ఇట్లు
జంపా దీనదయాళ్,
పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్ తరపు న్యాయవాది,
విజయవాడ. సెల్ : 91105 77509

మహారాజశ్రీ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు,
మంగళగిరి
I.A. No. 154/2023, 155/2023 and 156/2023 in O.S. No. 84/2022
Between :
వేంపాటి సాంబశివరావు మరియు శ్రీనివాసరావు
.... పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్
మరియు
1) వేజండ్ల గురు సాంబ్రాజ్య రజని .. 1వ ప్రతివాది
2) బత్తుల మాధవి .... 2వ ప్రతివాది
3) G.N.R. Infrastructurers, rep. by its Managing Partmenrs గాదె నరసారెడ్డి, గాదె నీలిమ,- Builder & Developer, Plot No. 860, Flat No. 401, భ్రమరాంబ నివాస్, మాతృశ్రీ నగర్, మియాపూర్, హైదరాబాద్-49, తెలంగాణా రాష్ట్రం.
పై నెంబరు కేసులో పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం 3వ ప్రతివాదులుగా వున్న మీరు ది. 1-4-2025 ఉదయం 10-30 గం.లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరయి మీకుగల అభ్యంతరాలను తెలియజేసు కొనవలయును. లేనియెడల పరోక్షంగా పై కేసును తీర్మానించ బడును. అని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ పరచటం జరిగినది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 1-4-2025
ఇట్లు
జంపా దీనదయాళ్,
పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్ తరపు న్యాయవాది,
విజయవాడ. సెల్ : 91105 77509

శాసనసభలో కమీషన్ రగడ

- 30 శాతం కమీషన్ల సర్కార్ : కెటిఆర్
- ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడండి : డిప్యూటీ సిఎం భట్టి
- కెటిఆర్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సభ్యులు పట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కమీషన్ సర్కార్' అంటూ బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్ చేసిన వ్యాఖ్య శాసనసభలో పెద్ద దుమారాన్నే లేపింది. 'మైకు చేతిలో ఉందికదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడొద్దు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి. ఆధారాలతో చూపించు.. లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పు' అంటూ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క భావోద్వేగ హెచ్చరికతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇటు కాంగ్రెస్.. అటు బిఆర్ఎస్ సభ్యుల పోటాపోటీ నినాదాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. భట్టి క్షమాపణలు చెప్పాలని బిఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్ద దూసుకెళ్లారు. అక్కడ ముందుకెళ్లకుండా మార్షల్స్ అడ్డుగోడగా నిలబడ్డారు. కూర్చుంటేనే మైకు ఇస్తానని ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేయడంతో '30 శాతం కమీషన్ సర్కార్ డౌన్..డౌన్..30 శాతం కమీషన్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ బిఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేసుకుంటూ బయటకు వెళ్లి అసెంబ్లీలోకి గేటు వద్ద ఆందోళనకు దిగారు.

రూ.4 కోట్లు ఇచ్చి... రూ.40 కోట్ల ప్రకటనలతో ప్రచారం : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

శాసనసభలో ఐఅండ్‌పిఆర్ శాఖ పద్దులపై చర్చల్లో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘాలను చూసి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలనుకోవడం దుర్మార్గమన్నారు. చాలా మంది సీనియర్లు యాజమాన్యాలు నచ్చక సొంతంగా వెబ్‌సైట్లు పెట్టుకుని నడిపించుకుంటున్నారని తెలిపారు. జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలంపై సుప్రీం కోర్టులో సీనియర్ లాయర్లతో కెసిఆర్ కేసు వాదింపజేశారని, ఆ భూమి కబ్జాకు గురికాకుండా కెటిఆర్ రక్షించారని కొనియాడారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం కింద రూ.4 కోట్లు ఇచ్చి మీడియాలో ప్రకటనల ద్వారా ప్రచారానికి రూ.40 కోట్లు ఖర్చుపెట్టారని ఆరోపించారు.

చర్చకు సిద్ధమేనా సత్యదూరపు మాటలు సరిగాదు : పొంగులేటి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పదేళ్లలో ఐఅండ్ పిఆర్ శాఖను సొంత ఆస్తిలాగా బిఆర్ఎస్ సర్కారు వాడుకుందని విమర్శించారు. వేరే రాష్ట్రాల్లోనూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని ఎత్తిచూపారు. పింక్‌కలర్ మీడియా ఛానళ్లకు, పత్రికలకు ఇచ్చిన ప్రకటనల ఖర్చు ఎంత? మిగతా పత్రికలకు ఇచ్చినదెంత? అనే దానిపై చర్చ పెట్టడానికి తాము సిద్ధమని ప్రకటించారు. జాతీయ పార్టీ అని చెప్పుకుని మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సర్కారు తరపున ప్రకటనలు ఇచ్చారని విమర్శించారు. తాము మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పేపర్ యాడ్‌లు ఇచ్చినట్టు అభియోగం మోపడం సరిగాదన్నారు. ఐఅండ్‌పిఆర్ ద్వారా ఎన్నికల యాడ్‌లు ఇచ్చినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. నాలుగు కోట్ల రూపాయల్చి.. యాడ్ల కోసం రూ.40 కోట్ల ఖర్చుపెట్టామనడం సరిగాదని కొట్టిపడేశారు. అదే సమయంలో కౌశిక్‌రెడ్డి, ఇతర బిఆర్ఎస్ సభ్యులు రన్నింగ్ కామెంట్ చేయడాన్ని ప్యానల్ స్పీకర్ తప్పుబట్టారు. క్రాస్ ట్రాక్ చేయొద్దని సభ్యులకు సూచించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహారాష్ట్ర ఎన్నికల్లో తాము ఖర్చుపెట్టినట్టు మీరు చూపాలని సవాల్ విసిరారు. పత్రికా ప్రకటనలపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. పల్లా మాట్లాడే సమయంలో మంత్రులు పదేపదే లేచి మాట్లాడటంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్యానల్ స్పీకర్ జోక్యం చేసుకుని మాట్లాడారు. సబ్జెక్టు వరకు పరితిమితం కండి రాజేశ్వర్‌రెడ్డి' అని సూచించారు.

30 శాతం కమీషన్ సర్కార్..... : కెటిఆర్

బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్ మాట్లాడుతూ.. 'సభలో విశేష అనుభవమున్న, ఉన్నత పదవులను అలంకరించిన మిమ్మల్ని అడుగుతున్నా. రికార్డులు తెప్పించండి. మంత్రులు అన్ని సార్లు జోక్యం చేసుకోవడమేంటి అధ్యక్షా. ఎసెన్స్ ఆఫ్ డెమెక్రసీ సార్. కాంగ్రెస్ నుంచి 53 మంది కొత్త సభ్యులున్నారు. ప్రతి పక్షంగా ప్రభుత్వం చేస్తామని చేయని వాటిని ఎత్తి చూపుతాం. అలవుగాని హామీల గురించి అడుగుతాం. మంత్రులకు దయచేసి చెప్పండి. ఎక్కువ ఇన్వాల్వ్ కావొద్దని చెప్పండి. చెప్పాలనుకుంటే మేం కూడా చెప్పొచ్చు. 30 శాతం కమీషన్ సర్కారు అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారని కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నాలు చేస్తున్నారు' అంటూ కెటిఆర్ వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులంతా లేచి ముందుకొచ్చారు.

30 శాతం కమీషన్ నిరూపించు..లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

30 శాతం కమీషన్లు ఎక్కడ తీసుకున్నామో కెటిఆర్ నిరూపించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి సవాల్ విసిరారు. లేదంటే రాష్ట్ర ప్రజలకు, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చామని, తాడితపీడిత, అణగారిన వర్గాల వారి పక్షాన నిలబడ్డామని చెప్పారు. 'మీలాగా రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకోలేదు. సభ్యులు మాట్లాడేటప్పుడు నిబద్ధతతో, ఒళ్ళు దగ్గర పెట్టుకునే మాట్లాడాలి. డిస్కర్షన్, డిబేట్ అంటూనే ప్రతిమాటా అబద్ధం చెబితే ఎలా అని నిలదీశారు. '40 వేల కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు మీరు పెండింగ్లో పెట్టి పోయారు, మీ పాపం వల్ల మొత్తం లక్ష కోట్ల బిల్లులు పెండింగ్లో పడ్డాయి. పనులు చేసిన వాళు బిల్లులు రాక సచివాలయం చుట్టూ రోజూ తిరుగుతున్నారు. దానిపైనా అసత్య ప్రచారం చేయడం తగదు' అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరిట అడ్డ గోలుగా ప్రకటనలు ఇచ్చామని అబద్ధాలు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. కెటిఆర్ వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. ఇతర సభ్యుల మాటల్లోనూ అన్‌పార్లమెంట్ పదాలుంటే తొలగిస్తామని హామీనిచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు '30 శాతం కమీషన్ సర్కార్ డౌన్ డౌన్...30 శాతం కమీషన్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేసుకుంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

ఆర్థిక మంత్రిగా కూడా ఉండనివ్వరా : పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో సిఎల్పీ నేతగా మల్లు భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక కాంగ్రెస్ సభ్యుల్ని సంతలో లెక్క కొన్నారని విమర్శించారు. దళిత నేతకు సిఎల్పీ పదవి లేకుండా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయనే ఆర్థిక మంత్రిగా ఉన్నారని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు ఇలాగే, ఇప్పుడూ ఇలాగే వ్యవహరిస్తున్నారు.. దళితుడు ఆర్థిక మంత్రిగా ఉండొద్దా? అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని బిఆర్ఎస్ సభ్యులకు సూచించారు.

ఇద్దరు పిల్లల నిబంధన సడలింపుపై సిఎంతో చర్చిస్తా : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మందికి అవకాశం లేకపోవడంపై సిఎం రేవంత్ రెడ్డితో చర్చించనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణ పంచాయత్ రాజ్ యాక్ట్, 2018 సవరణ బిల్లును ఆమోదించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకోనున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీలుగా మారిన తండాల్లో అక్కడే రేషన్ షాపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసమే పంచాయతీ ఎన్నికలు ఆలస్యమవుతున్నాయనీ, కేంద్రం తొందరంగా ఆమోదిస్తే బిసిలకు అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు జరిగిన చర్చలో, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, బిల్లును ఆమోదిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల విలీనంతో ఉపాధి తగ్గి, పన్నులు పెరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలని కోరారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పెద్ద ధన్వాడ గ్రామాల్లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దని కోరారు. దానిని పారిశ్రామిక ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీ, పంచాయతీల మధ్య ఇద్దరు పిల్లల నిబంధనలో తేడాలెందుకు? అని ప్రశ్నించారు.

నిమ్స్‌లో గుండెమార్పిడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏళ్ల యువకుడికి నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ అమరేశ్ రావు నేతత్వంలోని వైద్య బందం ఈ నెల 7న శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రిలో పోస్ట్ ఆపరేషన్ సేవలతో అతను పూర్తి కోలుకుకోవడంతో డిశ్చార్జి చేసినట్టు డాక్టర్ గోపాల్, డాక్టర్ కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సిబ్బందిని అభినందించారు. ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా గుండె మార్పిడి చేశారు,

అభివాదం తెలుపుతున్న సిఐటియు నాయకులు

'ప్రీమియర్' ఎన్నికల్లో సిఐటియు కూటమిని గెలిపించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవకాశవాద పొత్తులతో కార్మిక వర్గాన్ని మోసం చేయాలని చూస్తున్న బిఆర్ఎస్‌కెవి, బిఎంఎస్ నాయకుల విధానాలను తిప్పికొట్టి కార్మికులకు మెరుగైన ఒప్పందం కోసం సిఐటియు కూటమిని గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ కంపెనీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచార సభ బుధవారం సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లూరి మల్లేశం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర నేతలు మల్లికార్జున్, భూపాల్, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీను, కర్రి సత్యనారాయణ, సంపత్, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు బచ్చిరెడ్డి, రాజిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు రేగు బాలు నర్సయ్య మాట్లాడారు. 20 ఏళ్లుగా కంపెనీలో బిఎంఎస్, బిఆర్ఎస్‌కెవి సంఘాలు గెలుపొంది కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేశాయన్నారు. మెరుగైన వేతన ఒప్పందాలు చేసి కార్మికులకు మెరుగైన భవిష్యత్‌ను సిఐటియు అందించిందన్నారు.

కారును ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు మహంకాళి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్ పేట డివిజన్‌కు చెందిన ప్రణయ్ (18), హర్షిత్ (21) జిహెచ్ఎంసి వెస్ట్ కంట్రోల్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఐదు గంటలకు ఇద్దరూ కలిసి స్పోర్ట్స్ బైక్‌పై మహంకాళి పిఎస్ పరిధిలోని ఎస్‌డి రోడ్డులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తా వద్ద అతివేగంగా స్విఫ్ట్ డిజైర్ కారును వారు ఢీకొట్టారు. దాంతో ప్రణయ్ అక్కడికక్కడే మృతిచెందారు. హర్షిత్‌ను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మా పోరాటానికి మద్దతివ్వండి

- సిపిఎంను కోరిన హెచ్‌సియు ఐక్య కార్యాచరణ బృందం
- అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని జాన్‌వెస్లీ హామీ

జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌సియు ఐక్య కార్యాచరణ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు తాము చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని హెచ్‌సియు ఐక్య కార్యాచరణ బృందం కలిసింది. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో జాన్‌వెస్లీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు, భూముల వేలానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భూములు వేలం వేస్తే జరిగే నష్టంపై విద్యార్థులు జాన్‌వెస్లీకి విన్నవించారు. తమ పోరాటానికి సిపిఎం అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. యూనివర్శిటీకి చెందిన కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్నా ఇప్పటికీ ఆ భూములను యూనివర్సిటీకి చెందినవిగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్స్ చేయించలేదన్నారు. వారికి చెందిన భూములను వారికే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం భారత్ స్పోర్ట్స్ సంస్థకు కేటాయించిన ఈ 400 ఎకరాలు అనంతరం అధికారంలోకి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. కానీ నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ విక్రయించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో విక్రయాలు చేయడం లేదని అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన చేసినా.. అక్కడ విక్రయించాలనుకుంటున్న భూములకు కనెక్ట్ చేస్తూ టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే నిర్మాణాలు నిలిపివేయాలని కోరారు. విద్యార్థుల పోరాటానికి తమ పార్టీ మద్దతు సంపూర్ణంగా ఉంటుందన్నారు. అఖిల భారత స్థాయిలో తమ పార్టీ ఎంపీలతో కేంద్ర మంత్రుల దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు వెనక్కి తిరిగి చూడకుండా తమ పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఈ భూములు దక్కేందుకు పోరాడాలన్నారు. అవసరమైతే తాము ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పంకజ్, మెహిత్, సుభాషిణి, అంబేద్కర్, రమేష్, ఆకాశ్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలి

- టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

అభివాదం తెలుపుతున్న టిపిఎస్‌కె నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో 11 ఏళ్లుగా కళాకారులకు 'సంక్షేమం' అంటే తెలియని సాంస్కృతిక రంగం-బడ్జెట్ అంశంపై హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టిపిఎస్‌కె, పిఎన్ఎం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పిఎన్ఎం కార్యదర్శి ఎన్ మారన్న అధ్యక్షత వహించారు.

భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో ఆట పాట ప్రజలకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇక్కడ పాటలే ముందుండి ప్రజలను నడిపించాయని అన్నారు. 11 ఏళ్లుగా తెలంగాణ కళాకారుల పట్ల పాలకులు నిర్లక్ష్యం చూపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.74 కోట్ల 35 లక్షలు సాంస్కృతిక రంగానికి కేటాయించిందని తెలిపారు. ఇందులో సాంస్కృతిక సారథి కళాకారుల వేతనాలు, సాంస్కృతిక రంగం జీతభత్యాల నిర్వహణ కిందనే రూ.34 కోట్ల 35 లక్షలు పోతాయని, మిగతా రూ.40 కోట్లు ఎవరికి ఖర్చు చేశారో లెక్కలు చెప్తారా ? అని ప్రశ్నించారు. కట్ట నర్సింహా మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఒక మాయ అని విమర్శించారు. వృద్ధాప్య పింఛన్ల కోసం రూ.13 కోట్లు కేటాయిస్తే.. ఆరు కోట్ల రూపాయలు ఇచ్చినట్టు గణాంకాలు చూపుతున్నారని, మిగతా ఏడు కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు.

తెలంగాణ నాటకరంగం కళాకారులు కె శాంతారావు మాట్లాడుతూ.. కళాకారులకు గుర్తింపు కార్డులు లేవు, పింఛన్లు లేవు, ఇళ్లు లేవు, బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా గౌరవ వేతనం లేదని తెలిపారు. కళాకారుల జెఎసి కన్వీనర్ మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ.. తెలంగాణలో పట్టెడన్నం పాత వస్త్రాలు కళాకారులకు.. పదవులు పట్టాభిషేకాలు పాలకులకా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు రాకేష్ రావణ్, తెలంగాణ ప్రజానాట్య మండలి సభ్యులు శ్రీనివాస్, సాంబరాజు, యాదగిరి, పి కల్యాణ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి ఆనంద్, ఆశన్న, టిపిఎస్‌కె సభ్యులు జి నరేష్, పి రాజయ్య, తెలంగాణ సాంస్కృతిక సంఘం డప్పు స్వామి, జానపద వృత్తి కళాకారుల సంఘం కె భాస్కర్, కళాకారిణి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద జాతీయ రహదారి-44పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందారు. భర్త ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. సిఐ నరసింహారావు తెలిపిన వివరాలు ప్రకారం.. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన పాండు (45), సక్కుబాయి (38) దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. సక్కుబాయి అమ్మగారి ఇల్లు కొందుర్గుకు వెళ్లిన వీరిరువురూ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు స్కూటీపై తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో తిమ్మాపూర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ బ్రేకులు ఫెయిల్‌కావడంతో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా స్కూటీపై వెళ్తున్న దంపతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సక్కుబాయి అక్కడికక్కడే మృతిచెందింది. పాండును హైదరాబాద్‌లో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరగడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక సిఐ నరసింహారావు, ఎస్ఐలు మురళిగౌడ్, సత్యశీలరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండు హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, అతని భార్య సక్కుబాయి మహేశ్వరం మండలంలోని ఎన్‌డి తండాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వారి మృతితో మహేశ్వరం మండల పంచాయతీ కార్యదర్శులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ తోటి ఉద్యోగి మృతి చెందడంతో వారు సంతాపం వ్యక్తం చేశారు.

నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో కెటిఆర్‌పై కేసు నమోదు

- రాజకీయ రంగు పులుముకున్న టెన్త్ పేపర్ లీకేజీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారానికి రాజకీయ రంగు పులుముకుంటోంది. ఈ నెల 21వ తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో జరిగిన పదో తరగతి తెలుగు ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. అధికార, ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు ప్రశ్నాపత్రం లీకేజీ చేశారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. దాంతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్, కొనతం దిలీప్ కుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ఆరోపణలు చేశారంటూ నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత శ్రీనివాస్ గౌడ్, మర్రూరు మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉగ్గిడి శ్రీను కెటిఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్రూరు మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఏ1 కెటిఆర్, ఏ2 కొనతం దిలీప్ కుమార్, ఏ3 టీ న్యూస్ యజమాన్యంపై, నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఏ1 మన్నె క్రిశాంక్, ఏ2 కెటిఆర్, ఏ3 కొనతం దిలీప్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదులో ఏ1 కొనతం దిలీప్ కుమార్, ఏ2 మన్నె క్రిశాంక్, ఏ3 కెటిఆర్, ఏ4 తెలుగు స్క్రైబ్ ఎండి, ఏ5 మిర్రర్ టివి యాజమాన్యంపై మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయి.

అప్సర హత్య కేసులో దోషికి జీవితఖైదు

- రూ.10 లక్షల జరిమానా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లి చేసుకుంటానని నమ్మించి తర్వాత ఆమెను అడ్డు తొలగించుకోవడంలో భాగంగా పథకం ప్రకారం హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష పడింది. 2023లో సంచలనం సృష్టించిన ఈ కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె నరేందర్‌రెడ్డి ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో పూజారి అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణ నివాసముండేవాడు. కారుగంటి అప్సర (30) అతను పనిచేసే గుడికి వచ్చేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని సాయికృష్ణ నమ్మించి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అంతకు ముందే అతనికి వేరే మహిళతో వివాహం జరిగింది. ఇదిలా ఉండగా కొద్ది రోజులకు తనను పెళ్లి చేసుకోవాలని అప్సర గట్టిగా అడిగింది. దాంతో ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలని సాయికృష్ణ పథకం వేశాడు. పథకంలో భాగంగా 2023 జూన్ 3వ తేదీన శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ రెవెన్యూలో ఉన్న నవరంగ్ వెంచర్‌లోకి తన కారులో ఆమెకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమె ముఖానికి ఒక కవరు చుట్టి ఊపిరాడకుండా చేసి ఆ తర్వాత తలపై రాయితో కొట్టి చంపాడు. అనంతరం మృతదేహాన్ని రెండ్రోజులపాటు కారులోనే ఉంచుకొని తర్వాత సరూర్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనకాల ఒక గుంత తవ్వి పాతి పెట్టాడు. అప్సర కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయికృష్ణపై అనుమానం వ్యక్తం చేశారు. శంషాబాద్ పిఎస్‌లో మహిళ మృతి విషయంపై అప్పటి సిఐ శ్రీధర్‌కుమార్ నిందితునిపై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. బాధితురాలి తరపున ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవికుమార్ వాదించారు. కేసుకు సంబంధించిన వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం ఆధారాలు అన్నీ పరిశీలించింది. నిందితునిపై అభియోగాలు రుజువు కావడంతో రంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి వై జయప్రసాద్ నిందితునికి జీవితకాల శిక్షతో పాటు రూ. పది లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

విఆర్ఎ వారసులకు ఉద్యోగాలివ్వాల్సిందే

- ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- వారంలో పరిష్కరించపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఉద్యోగాలు వచ్చే వరకు పోరాటం : జూలకంటి రంగారెడ్డి

మహాధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్ఎ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిఒ 81, 85 ప్రకారం.. 3,797 మంది విఆర్ఎ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, కొత్తగా తీసుకొస్తున్న గ్రామ పరిపాలనా అధికారి (జిపిఒ) పోస్టుల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా పాలడుగు మాట్లాడుతూ.. సర్కార్ ఎంత కాలయాపన చేసినా ఉద్యోగాలు సాధించే వరకూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఈ లోపు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీఆర్ఏల విషయంలో ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగిలిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని వీఆర్ఏ జేఏసీ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. తండ్రి, తాతలు, నేటి వరకు విఆర్ఎలతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే మిగిలిన వీఆర్ఏల వారసులను విధుల్లోకి తీసుకుంటామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీనిచ్చి, ఇప్పుడు సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో తక్కువ వేతనంతో ఎక్కువ పని చేస్తున్న వారు కేవలం విఆర్ఎలేనని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. ధర్నాకు కెవిపిఎస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సర్కార్ స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విఆర్ఎల సమస్యల పరిష్కారానికి కమిటీ వేశాం.. రిపోర్టు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని కాలయాపన చేయడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. విఆర్ఎల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం 15 నెలలుగా కాలయాపన చేస్తుండటంతోనే రోడ్డు మీదకు రావాల్సి వచ్చిందని విఆర్ఎ-జెఎసి కన్వీనర్ వంగూరి రాములు అన్నారు.

గత సిఎం విఆర్ఎలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అసెంబ్లీలో ప్రకటన చేశారని గుర్తు చేశారు. జిఒలు వచ్చి రెండేళ్లు, ప్రభుత్వం మారి ఏడాదిన్నర, కమిటీ వేసి ఏడాది కావస్తున్నా.. వీఆర్ఏల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. జిపిఒ వ్యవస్థలో విఆర్ఎలకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్హతలను బట్టి జిపిఒలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పలపల్లి బాలరాజు, ఎంఎస్ఎఫ్ నాయకులు సోమశేఖర్ మాదిగ, జెఎసి జిల్లాల నాయకులు పాల్గొన్నారు.